క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలి



పోలింగ్ విధులపై అవగాహన కల్పిస్తున్న ఆర్వో

ధర్మపురి: రానున్న అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా నియోజకవర్గంలోని ప్రతి పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి దివాకర అన్నారు. ధర్మపురిలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం వివిధ శాఖల అధికారులకు పోలింగ్ కేంద్రాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌ను సక్రమంగా జరిగేలా చూడాలని, ఏలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చూడాలని తెలిపారు.

ఇంటింటికీ పోల్‌చిట్టీల పంపిణీ



పోల్‌చిట్టీలు పంపిణీ చేస్తున్న బీఎల్‌వోలు

ఇబ్రహీంపట్నం: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 30 న నిర్వహించనున్న పోలింగ్‌కు ఓటు వేసేందుకు బీఎల్‌వోలు ఇంటింటికీ పోల్‌చిట్టీలను మంగళవారం పంపిణీ చేశారు. మండలంలో 30,476 మంది ఓటర్లు ఉండగా, పురుషులు 14,189 , స్త్రీలు 16,287 మంది ఓటర్లు ఉన్నారు. మండలంలోని 17 గ్రామాలలో 37 పోలింగ్ కేంద్రాలలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకొనున్నారు. మండలంలో ఈ ఎన్నికల్లో ఇబ్రహీంపట్నం ప్రాథమిక పాఠశాలలో మహిళా పోలింగ్‌కేంద్రం, కొమటికొండాపూర్ ప్రాథమిక పాఠశాలల్లో మోడల్ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

ప్రతీ ఓటరుకు ఓటర్ స్లిప్‌లు అందించాలి



ఓటర్‌స్లిప్‌ల పంపిణీ పరిశీలిస్తున్న ఎంపీడీవో

రాయికల్: మండలంలోని ప్రతీ ఓటరుకు ఓటరు స్లిప్‌లు అందేలా చూడాలని ఎంపీడీవో సంతోష్‌కుమార్ సూచించారు. మంగళవారం మండలంలోని అల్లీపూర్, సింగరావుపేట గ్రామాల్లో ఎన్నికల ఓటరు స్లిప్‌లను పంపిణీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఓటరుకు ఓటరు స్లిప్‌లు పంపిణీ చేయాలని బీఎల్వోలకు సూచించారు.

సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై సతీశ్

పెగడపల్లి: మండలంలోని వెంగళాయిపేట గ్రామానికి చెందిన రాగళ్ల రమేశ్ అనే యువకుడు సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. ఈ మేరకు పెగడపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసి పోయిన ఫోన్‌ను గుర్తించి మంగళవారం బాధితుడు రమేశ్‌కు అందజేసినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



సరుకులు అందిస్తున్న యువసేన సభ్యులు

ఇబ్రహీంపట్నం: మండలంలోని ఎర్దండి ఒడ్డెర కాలనీలో నిరుపేద కుటుంబానికి చెందిన బొదాసు పోశాని అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. దహన సంస్కారాలకు ఆర్థిక సాయంతో పాటు నిత్యావసర సరుకులను సంజయన్న యువసేన సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో సంజయన్న యువసేన సభ్యులు సురేశ్, గంగారెడ్డి, సాయి, అక్షయ్, అశోక్, సంతోష్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే బీఆర్ఎస్ లక్ష్యం

• బీఆర్ఎస్ వేములవాడ ఎమ్మెల్యే అభ్యర్థి లక్ష్మీనరసింహారావు



కిష్టంపేటలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు

చందుర్తి: అన్ని వర్గాల సంక్షేమమే బీఆర్ఎస్ లక్ష్యమని వేములవాడ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు. చందుర్తి మండలం కిష్టంపేట, రామారావుపల్లె, ననుగుల, దేవుని తండా, జలపతి తండా, కట్టలింగంపేట, లింగంపేట, జోగాపూర్, అనంతపల్లి గ్రామాల్లో మంగళవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో ప్రతిపక్ష పార్టీల మాటలు నమ్మి వారికి ఓట్లు వేసి మోసపోతే, బతుకులు ఆగమవుతాయన్నారు. తొమ్మిదిన్నరేళ్ల పాలనలో అన్ని వర్గాల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రారంభించి, అన్ని వర్గాల ప్రజలకు బీఆర్ఎస్ అండగా నిలిచిందన్నారు. మరింత అభివృద్ధి జరగాలన్న, సంక్షేమ పథకాలు అమలు కావాలంటే మూడోసారి కేసీఆర్‌ను సీఎం గెలిపించుకునే బాధ్యత మీపై ఉందన్నారు. నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించుకుంటే, సీఎంగా కేసీఆర్ గెలుస్తాడన్నారు. రైతును రాజుగా చూడాలనే సీఎం కేసీఆర్ వ్యవసాయానికి 24 గంటల కరెంటు ఇస్తుంటే, కాంగ్రెసోళ్లు మూడు గంటల కరెంటుకు 10 హెచ్‌పీ మోటారుతో నీళ్లు పారించుకోవాలని చెబుతున్నారు. కరెంటు ఇచ్చే సీఎం కేసీఆర్ కావాలో, కరెంటు కోతలు పెట్టే కాంగ్రెస్ కావాలో మీరే ఆలోచించుకోవాలన్నారు. ఈ ప్రచారంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, కేడీసీసీ డైరెక్టర్ జలగం కిషన్‌రావు, సెస్ డైరెక్టర్ పోన్నాల శ్రీనివాస్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య, చందుర్తి సింగిల్‌విండో అధ్యక్షుడు తిప్పని శ్రీనివాస్, దప్పుల అశోక్, కొమ్ము రమేశ్, సర్పంచులు కరుణాకర్, కమలాకర్, లక్ష్మి, ఏనుగుల జమున పాల్గొన్నారు. చందుర్తి మండలం రామారావుపెల్లికి చెందిన అంబేద్కర్ సంఘం 150 మంది సభ్యులు, కోనరావుపేట మండలం కనగర్తి గ్రామానికి చెందిన యువకులు బీఆర్ఎస్‌లో చేరారు.



ప్రచారంలో పాల్గొన్న చల్మెడ సతీమణి సునీల

భార్య, కూతురు ప్రచారం

వేములవాడ: వేములవాడలో బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ భార్య సునీల మంగళవారం ఇంటింటికి తిరుగుతూ బొట్టుపెట్టి ఓట్లను అభ్యర్థించారు.

కథలాపూర్: కథలాపూర్ మండలం గంభీర్‌పూర్ గ్రామంలో చల్మెడ కూతురు నివేదిత ఇంటింటా ప్రచారం చేశారు. ఎంపీపీ జవ్వాజి రేవతి, సర్పంచ్ పోతు సింధూజ, నాయకులు నస్కూరి భాస్కర్, తిరుపతి, సాగర్ పాల్గొన్నారు.

డెయిరీ చైర్మన్ ప్రచారం

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని నూకలమర్రిలో భాషానాయక్ తండాలో కరీంనగర్ డెయిరీ చైర్మన్ రాజేశ్వర్‌రావు ప్రచారం చేశారు.

ఇంటింటి ప్రచారం

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట, కథలాపూర్ గ్రామాల్లో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి ఇంటింటా ప్రచారం చేశారు.

కోనరావుపేట: మండలంలోని నిమ్మపల్లిలో సర్పంచ్ కొక్కుల భారత, గ్రామశాఖ అధ్యక్షుడు జవ్వాజి మల్లయ్య, నాయకులు శ్రీనివాస్, రవి, మల్లారెడ్డి, లక్ష్మణ్, రమేశ్, రాములు ప్రచారం చేశారు.

కాంగ్రెస్ అబద్ధపు హామీలు నమ్మకండి



బీఆర్ఎస్‌లో చేరుతున్న వివిధ పార్టీల నాయకులులు

వెల్గటూర్: కాంగ్రెస్ నాయకులు చెప్పే అబద్ధపు హామీలు నమ్మవద్దని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. కోటిలింగాలలో వివిధ పార్టీలకు చెందిన సుమారు 50 మంది మంత్రి కొప్పుల ఈశ్వర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. 60 ఏళ్లుగా అధికారంలో ఉండి ఏమీ చేయని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇప్పుడు మళ్లీ ఆరు గ్యారంటీల పేరుతో అంటూ కొత్త నాటకాలకు తెరతీశారని, ప్రజలు గమనించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

కొప్పుల గెలవాలని కొండ గట్టులో ముడుపు

గొల్లపల్లి: మంత్రి కొప్పుల ఈశ్వర్ మరోసారి ఎమ్మెల్యేగా గెలవాలని గొల్లపల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకులు కొండగట్టు ఆంజనేయ స్వామికి ముడుపు కట్టారు.

నాన్న గెలుపు కోసం కూతురు ప్రచారం

పెగడపల్లి: ధర్మపురి ప్రజలకు అండగా ఉంటున్న బీఆర్ఎస్ అభ్యర్థి ఈశ్వర్‌ను మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆయన కూతురు నందిని కోరారు. మండలంలోని నంచర్లలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ శోభ, నాయకులు ఉన్నారు.

బీఆర్ఎస్‌ను ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి

ధర్మారం: బీఆర్ఎస్‌కు మరోసారి అవకాశం కల్పిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తపల్లి, బొమ్మారెడ్డిపల్లి, ధర్మారం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ, ఎంపీపీ, సర్పంచులు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ధర్మపురి ప్రజలు మార్పు కోరుకుంటున్నారు



గొల్లపల్లిలో సభకు భారీగా హాజరైన జనం




కాంగ్రెస్‌లో చేరుతున్న వివిధ పార్టీల కార్యకర్తలు

వెల్గటూర్: ధర్మపురి నియోజకవర్గ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని ధర్మపురి కాంగ్రెస్ అభ్యర్థి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. కుమ్మరిపల్లి, బీరుసాని గ్రామాలకు చెందిన సుమారు 350 మంది వివిధ పార్టీల కార్యకర్తలు, మహిళలు మంగళవారం లక్ష్మణ్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. బీఆర్ఎస్ పాలనలో విసిగిపోయిన ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, సర్పంచ్ మేరుగు మురళి, శ్రీకాంత్‌రావు, ఉదయ్, నాయకులు పాల్గొన్నారు.

మీ బిడ్డగా..ఆశీర్వదించండి

గొల్లపల్లి: నాలుగుసార్లు ఓడిపోయినా ప్రజల మధ్యే ఉండి ప్రజా సమస్యలపై పోరాటం చేసిన తనను మీ బిడ్డగా ఆశ్వీర్వాదం ఇవ్వండి..అభివృద్ధి ఏంటో చూపిస్తా అని కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గొల్లపల్లి మండలంలోని ఆత్మకూర్, దమ్మన్నపేట, లక్ష్మీపూర్,భీంరాజ్‌పల్లి, గొల్లపల్లి, శ్రీరాముపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మేడిపల్లిలో పోలీసుల కవాతు



మేడిపల్లిలో కవాతు చేస్తున్న పోలీసులు

మేడిపల్లి: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మేడిపల్లి మండల కేంద్రంలో మంగళవారం పోలీసులు కవాతు నిర్వహించారు. కొండాపూర్ రోడ్డు నుంచి పోలీస్‌స్టేషన్ వరకు బీఎస్ఎఫ్, ఆక్టోపస్, ఆర్మ్‌డ్ ఫోర్స్, స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో అడిషినల్ ఏఆర్ఎస్పీ భీంరావు, మెట్‌పెల్లి డీఎస్పీ రవీందర్ రెడ్డి, బీఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాన్‌డెంట్స్ సురేశ్ కుమార్ సింగ్, దీపాంక్ దేశా, కోరుట్ల సీఐ ప్రవీణ్ కుమార్, మేడిపల్లి, కథలాపూర్ ఎస్సైలు శ్యామ్‌రాజ్, కిరణ్ కుమార్, 200 మంది సివిల్, బీఎస్ఎఫ్ అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేసే అవకాశం ఇవ్వండి

• వేములవాడ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆది శ్రీనివాస్



కోనరావుపేట: మరిమడ్లలో మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

కోనరావుపేట: వేములవాడ నియోజకవర్గ అభివృద్ధి చేసేందుకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటున్న తనకు ఒక్కసారి అవకాశం ఇవ్వాలని డీసీసీ అధ్యక్షుడు, వేములవాడ నియోజవర్గ అభ్యర్థి ఆది శ్రీనివాస్ అన్నారు. మండలంలోని మరిమడ్లలో మంగళవారం రాత్రి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోనరావుపేట మండలం కోనసీమలా మారిందని మంత్రి కేటీఆర్ సాక్షాత్తు అసెంబ్లీలో అబద్ధమాడారన్నారు. అబద్దాల హామీలతో గెలిచిన ఎమ్మెల్యే పరాయి దేశంలో ఉండి పాలన సాగించారన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, జిల్లా నాయకులు మల్లేశం, నారాయణ పాల్గొన్నారు.



మేడిపల్లిలో యువతికి హైఫై అంటున్న ఆది శ్రీనివాస్

మీ బిడ్డనై వస్తున్న ఆశీర్వదించండి

మేడిపల్లి: మీ బిడ్డనై వస్తున్న ఆశీర్వదించండి అని ఆది శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కొండపూర్, కాచారం, వెంకట్రావుపేట, కమ్మరిపేట, భీమారం, దేశాయిపేట, లింగంపేట గ్రామాల్లో మంగళవారం రోడ్‌షో నిర్వహించారు. నరేశ్‌రెడ్డి, రేండ్ల మధు, వంగ లింగం, చుక్క తిరుపతి, గంగరెడ్డి, తక్కురి తక్కయ్య, చాందు, జీవన్, ప్రశాంత్ పాల్గొన్నారు.

రుద్రంగి: మండల కేంద్రంలో డీసీసీ కార్యదర్శి చెలుకల తిరుపతి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డీసీసీ కార్యదర్శులు గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు తర్రె మనోహర్ పాల్గొన్నారు.

మేడిపల్లిలో వికాస్‌రావు ప్రచారం



వికాస్‌రావుకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

మేడిపల్లి: ఉమ్మడి మేడిపల్లి మండలంలోని మాచాపూర్, వల్లంపల్లి, కల్వకోట, దమ్మన్నపేట, మన్నేగూడెం, లింగంపేట, దేశాయిపేట, గోవిందారం, మోత్కురావుపేట, పసునూర్, రాజలింగంపేట, మేడిపల్లి గ్రామాల్లో వేములవాడ బీజేపీ అభ్యర్థి చెన్నమనేని వికాస్‌రావు సుడిగాలి పర్యటన చేశారు. బీజేపీ అభ్యర్థిగా నామినేషన్ వేసిన తర్వాత మోదటిసారిగా మండలానికి రావడంతో బీజేపీ శ్రేణులు, మహిళలు, యువకులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. దమ్మన్నపేట, గోవిందారం గ్రామల్లో స్థానిక నాయకుల ఆధ్వర్యంలో మహిళలు బతుకమ్మలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో క్యాతం దశరథ రెడ్డి, మహేందర్ రెడ్డి, కారండ్ల మధుకర్, అన్నాడి జలపతి రెడ్డి, మనోజ్ రెడ్డి, తొగరి లక్ష్మీపతి, మకిలి ఇజ్రాయిల్, దాసరి రఘు, నాగెల్లి మహేశ్ పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ఇంటింటా ప్రచారం



కోనరావుపేట: కనగర్తిలో నాయకుల ప్రచారం

కోనరావుపేట: మండలంలోని కనగర్తి, నిజామాబాద్ గ్రామాల్లో బీజేపీ నాయకులు ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఇంటింటా తిరుగుతూ బొట్టు పెడుతూ మహిళలను ఓట్లు వేయాలని కోరారు. అన్ని గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలు అవుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పల్లం అన్నపూర్ణ, సింగిల్‌విండో మాజీ డైరెక్టర్ గోపాడి జ్యోతి, మాజీ వైస్‌ఎంపీపీ అంబోజి లక్ష్మీనారాయణ, నాయకులు బెంద్రం శ్రీనివాస్‌రెడ్డి, పోగుల లచ్చిరెడ్డి, నాయిని రాంరెడ్డి పాల్గొన్నారు.

చిత్ర కథ: అధిక లోడుతో ధాన్యం రవాణా



మల్యాల: లారీల్లో సామర్థ్యానికి మించి ధాన్యం లోడ్ చేసి, రవాణా చేస్తుండడంతో గ్రామాల్లో విద్యుత్ వైర్లు, చెట్ల కొమ్మలతో ఇటు లారీ, అటు ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. లారీల్లో ధాన్యం బస్తాలు లారీలో వేసే ధాన్యం బస్తాలకు రెట్టింపు స్థాయిలో పైన వేస్తూ, రవాణా చేస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. దీనికి తోడు రోడ్డు పక్కనే నిలుపుతుండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. లారీలో పరిమితికి మించి ధాన్యం తరలిస్తున్న లారీలపై రవాణా శాఖ అధికారులు దృష్టిసారించాలని, ప్రమాదాలు జరుగకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అందుబాటులో ఉండి సేవ చేస్తా



మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

రాయికల్: ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి సేవ చేస్తానని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కుర్మపల్లి, కిష్టంపేట,సింగరావుపేట, శ్రీరాంనగర్ గ్రామాల్లో ఆయన ఇంటింటా ప్రచారం చేశారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని, ప్రతి ఒక్క కుటుంబానికి లబ్ధి చేకూరుస్తామన్నారు. చేతి గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో ఇంటింటా తిరుగుతూ జీవన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్టీయూ టీఎస్ మండల అధ్యక్షుడిగా రాజ్‌కిరణ్



రాజ్‌కిరణ్

కథలాపూర్: ఎస్టీయూ టీఎస్ కథలాపూర్ మండల అధ్యక్షుడిగా చింతకుంట జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుడు నల్ల రాజ్‌కిరణ్ ఎన్నికయ్యారు. మంగళవారం కథలాపూర్‌లో జరిగిన ఎన్నికల్లో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రధానకార్యదర్శిగా అడెపు రాజశేఖర్, అసోషియేట్ అధ్యక్షుడిగా తడుక రమేశ్, జిల్లా కౌన్సిలర్‌గా ఆర్.భూమయ్య, కోశాధికారిగా ఉశకోల విశ్వనాథం, ఉపాధ్యక్షులుగా పి.ఐలయ్య, సాయిదివ్య, రమేశ్. సంయుక్త కార్యదర్శిగా నరేశ్, రాజేశ్ ఎన్నికయ్యారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కోసం కృషి చేస్తూ, సంఘం బలోపేతానికి నూతన కార్యవర్గ సభ్యులు కృషి చేయాలని జిల్లా ప్రతినిధులు కోరారు.

ఇంటి నుంచి ఓటేసిన 15 మంది ఓటర్లు

కథలాపూర్: మండలంలోని ఐదు గ్రామాల్లో వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి నుంచి ఓటు వేసే అవకాశం కల్పించడంతో మంగళవారం 15 మంది ఓటుహక్కును వినియోగించుకున్నట్లు ఎంపీడీవో జనార్దన్ తెలిపారు. మండలంలోని 19 గ్రామాల్లో 56 మంది ఇంటి నుంచి ఓటు వేసేందుకు దరఖాస్తు చేసుకున్నారు. మూడు రోజులపాటు ఈ ప్రక్రియ ఉండగా, మంగళవారం 15 మంది ఓటు వేశారు. ఎస్సై కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

రోడ్డుపైనే స్కూల్ బస్సులు



రోడ్డుపై నిలిపిన ప్రైవేట్ స్కూల్ బస్సు

వెల్గటూర్: మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌కు చెందిన బస్సులతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేట్ స్కూల్‌కు చెందిన బస్సులు ప్రతి రోజూ ఉదయం 8 గంటల నుండి 9:30 వరకు స్కూల్‌కు విద్యార్థులను తీసుకువచ్చే బస్సులు రోడ్డుపై అడ్డంగా నిలపడం వల్ల అటు వైపు ఉన్న అమరేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే భక్తులు, మార్కండేయ కాలనీకి వెళ్లే ప్రజలు, కాలనీ నుంచి వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి వచ్చే ప్రజలు గంటల తరబడి నిరీక్షిస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిబంధనలు తుంగలో తొక్కి సరైన పార్కింగ్ స్థలం లేకున్నా అక్రమంగా పాఠశాలకు అనుమతులు పొంది ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న సదరు ప్రైవేట్ పాఠశాలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులకు సామగ్రి పంపిణీ

రాయికల్: మండలంలోని ఇటిక్యాల ఉన్నత పాఠశాలలో 6వ తరగతి విద్యార్థులకు మంగళవారం ఉపాధ్యాయు డు గాజంగి రాజేశం కంపాస్ బాక్స్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం సదాశివ్, ఉపాధ్యాయులు చెరుకు మహేశ్వరశర్మ, ఎం.శేఖర్ పాల్గొన్నారు.

కుక్కల బెడదతో పట్టణవాసుల బెంబేలు



మెట్‌పల్లి: పట్టణంలో రోజురోజుకూ కుక్కల బెడద తీవ్రమవుతోంది. వీటి నిర్మూలనకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. దీంతో వీటి సంఖ్య పెరుగుతూ పోతుంది. ఏ వీధిలో చూసినా గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. కుక్కలు జాతీయ రహదారిపై స్వైర విహారం చేస్తున్నాయి. రోడ్డు వెంట వెళ్లే వారు వాటిని చూసి భయపడుతున్నారు. సడెన్‌గా కుక్కలు అడ్డు వస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. చాలామంది వీటి బెడదతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి కుక్కల నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని మెట్‌పల్లి పట్టణవాసులు కోరుతున్నారు.